

**మహర్దశ పట్టేనా?**

కొడంగల్ బస్టాండ్ ప్రయాణికుల తాకిడికి సరిపోవడం లేదు. నిత్యం వేల మంది ప్రయాణం చేస్తుంటారు. 8లో▸



**కొనుగోలు దోపిడీ**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ జరుగుతోంది. రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. 8లో▸



**ఉల్లిసాగు.. భలేబాగు**

ఉల్లి మిశ్రమం లేని కూరలను ఊహించడం కష్టం. రోజూ తినే ఆహార పదార్థాలలో రుచి కల్పించడానికి ఉపయోగిస్తారు. 9లో▸

## న్యూస్‌రీల్

### రేపు స్పీకర్, ఎమ్మెల్యేల పర్యటన

**కుల్కచర్ల:** నూతన సభాపతి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బండవెల్కిచర్ల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించే మహాపడి పూజలో పాల్గొంటారని చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరైన పర్యటను విజయవంతం చేయాలని ఆంజనేయులు కోరారు.

### గిరిజన మహిళలకు ఉచిత శిక్షణ



శిక్షణకు హాజరైన మహిళలు

**కుల్కచర్ల:** మహిళలకు ఇంటి వద్దనే ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సయోధ్య స్వచ్ఛంద సంస్థ మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కోఆర్డినేటర్ రాంచంద్రయ్య తెలిపారు. శనివారం మండలం ముజాహిద్‌పూర్ శివారు పోటిగడ్డ తండాలో టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాబార్డ్ నిధులతో సయోధ్య అనే స్వచ్ఛంద సంస్థ మహిళలకు ఉపాధి కల్పించాలని ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని వివరించారు. మండల పరిధిలోని గ్రామాలకు చెంది 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు గిరిజన మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

### కార్యకర్తలను కాపాడుకుంటా

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యేతో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్

**తాండూరు రూరల్:** తనను గెలిపించేందుకు శ్రమించిన ప్రతీ ఒక్కరిని కాపాడుకుంటానని.. వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీష్ శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో రమేశ్ మహరాజ్‌తో కలిసి బీఎంఆర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.



నవాబుపేటలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నర్సరీ

# నర్సరీలకు రిజిస్ట్రేషన్

**పండ్లు, కూరగాయలు, పూల నర్సరీలు నిర్వహించే వారు నర్సరీ చట్టం 2010 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరి. రైతులకు, ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన మొక్కలు అందించేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చారు.**

**నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం**

- నకిలీ నార్ల విక్రయాలకు అడ్డుకట్ట
- అనుమతులు లేకున్నా.. నాణ్యతా ప్రమాణాలు పాటించకున్నా చర్యలు

**నవాబుపేట:** గ్రామాల్లో విచ్చలవిడిగా నర్సరీలు వెలుస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వివిధ రకాల నార్లను పెంచి రైతులకు అంటగడుతున్నారు. ఏ కంపెనీ సీడ్స్‌తో నారు పెంచారో కూడా తెలియకుండా నకిలీ విత్తనాలతో నారు పెంచి ఎలాంటి రశీదులు ఇవ్వకుండా నార్లు అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సరీ చట్టాన్ని విస్మరించిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**పుట్టగొడుగుల్లా వెలిసిన నర్సరీలు**

2010లోనే అప్పటి ప్రభుత్వం నర్సరీల చట్టాన్ని చేసి నియమ నిబంధనలు పాటించాలని సూచించింది. ఇన్నాళ్లు అధికారులు పట్టించుకోక పోవడంతో ఎలాంటి అనుమలు లేని నర్సరీలు అనేకం వెలిశాయి. ఇక నుంచి కొత్త నర్సరీ ఏర్పాటు చేయాలంటే రిజిస్ట్రేషన్ తప్పక తీసుకోవాల్సిందే. ఇప్పటికే ఉన్న నర్సరీలు సైతం అనమతులు తీసుకోవాల్సిందే లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే అధికారులు రైతులను, నర్సరీల యజమానులను ఆదేశించారు.

**విధివిధానాలు సిద్ధం**

నాణ్యమైన ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఉద్యాన నర్సరీ ధ్రువీకరణ, క్రమబద్ధీకరణ చట్టం 2010 తీసుకొచ్చింది. తెలంగాణ ఉద్యాన నర్సరీ రిజిస్ట్రేషన్ రూల్స్ 2017ను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను రూపొందించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యాన మొక్కలు పెంచి వాటితో వ్యాపారం నిర్వహించే నర్సరీలన్నింటికీ ఈ చట్టం వర్తిస్తుంది.

**నర్సరీల యజమానులు పాటించాల్సిన జాగ్రత్తలు**

- నారు పెంచే నర్సరీ చుట్టూ ఇన్సెక్ట్ నెట్ ఉండాలి. నెట్‌కు చిల్లులు లేకుండా చూసుకోవాలి.
- షేడ్‌నెట్ కు 3 అడుగుల విస్తీర్ణం వరకు కలుపు, చెట్లు ఉండకూడదు.
- నర్సరీకి సంబంధించిన ఏడు రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయాలి.
- నర్సరీ లైసెన్స్ నంబర్, ప్రింట్ బిల్లులు మాత్రమే నారు కొనుగోలు దారులకు ఇవ్వాలి.
- నర్సరీ లోపల పసుపు రంగు జిగురు అట్టాలు పెట్టాలి.
- నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూరా ట్రాప్–క్రాప్ (బంతి మొక్కలు) వేయాలి.
- నారు కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలి.

**ప్రధాన ఉద్దేశాలు**

- నర్సరీలు ఏర్పాటు చేసే వారు రిజిస్ట్రేషన్ చేసి ఉండాలి.
- ఏ రకం ఉద్యాన మొక్కలు పెంచుతున్నది పేర్కొనాలి.
- సరైన నాణ్యతా ప్రమాణాలతో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, మొక్కల ఉత్పత్తి, సరఫరా చేయాలి.
- చీడ పీడలు లేని ఆరోగ్యకరమైన మొక్కలు ఉత్పత్తి, సరఫరా చేయాలి.
- నాణ్యమైన నారు అందించాలి.
- నారును సాంప్రదాయ పద్ధతిలో కాకుండా షేడ్‌నెట్ నర్సరీల్లో ట్రేలల్లో ఆరోగ్యకరమైన నారును తక్కువసమయంలో ఎలాంటి చీడపీడలు లేకుండా అందించాలి.

**అనుమతి లేకుంటే చర్యలు**



నర్సరీ ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాలి. నర్సరీ ఏర్పాటు చేసే భూమి వివరాలు, నర్సరీలో ఉన్న స్టాక్ వివరాలు, ఆధార్ కార్డు, యజమాని ఫొటో, రూ.1000 చలానా చెల్లించాలి. మట్టి నమూనా రిపోర్టులతో జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయంలో ఈ నెల చివరి వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఇకపై అనుమతలు లేకుండా నర్సరీలు ఏర్పాటు చేసిన, ఉన్న నర్సరీలకు అనుమతులు తీసుకోకున్న చర్యలు తప్పవు.

– చక్రపాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, వికారాబాద్

## ఉద్యాన పంటలతో లాభాలు

**జిల్లా వ్యవసాయాధికారి గోపాల్**

**పరిగి:** ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని రైతు వేదికలో రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన, పట్టు పరిశ్రమలపై రైతులు లోతుగా తెలుసుకోవాలన్నారు. మన ప్రాంతంలో ధనియాలు, మిరప, పసుపు, అల్లం ఇతర సుగంధ ద్రవ్యాల పంటలకు అనుకూలమని చెప్పారు. మన దగ్గర పండిన పంటలకు విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఉద్యాన, పట్టుపరిశ్రమ పంటల సాగుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని వివరించారు. ఎస్సీలకు 75శాతం, ఇతరులకు 50శాతం సబ్సిడీపై అల్లం సాగు ఇతర సామగ్రి అందిస్తుందన్నారు. ప్రతీ రైతు ఈ వకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శివకుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే పర్మిట్లు ఇవ్వాలి**

**ధారూరు:** రైతులకు పర్మిట్లు ఇచ్చే ఏఈఓలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పొలానికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. శనివారం ఆయన ఏఈఓ సంజూరాథోడ్‌తో కలిసి మండల పరిధిలోని ధారూరు, గట్టెపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తూకం, తేమ శాతం పరిశీలన, సేకరించిన ధాన్యం తీసుకెళ్లేందుకు లారీలు అందుబాటులో ఉన్నయా లేదా అని ఏఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఓఓ మాట్లాడుతూ.. పత్తిని సాగుచేసిన రైతులు సీసీఐలో విక్రయించాలని సూచించారు. పత్తి రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్, పట్టాపాసు బుక్ జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి ఏఈఓల ద్వారా పర్మిట్లు తీసుకోవాలన్నారు. విక్రయించిన ధాన్యానికి వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలని.. గన్నీ బ్యాగుల కొరత రాకుండా చూడాలని రైతులు డీఏఓను కోరారు.



ధారూరు: గట్టెపల్లిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న డీఏఓ

## మీ భద్రతే.. మా బాధ్యత

- ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు
- తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్

**తాండూరు:** రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం డీఎస్పీ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలో వాహనాల తనిఖీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు పట్టణ పీఎస్‌లో సీఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం రొడ్డు భద్రతపై వాహనదారులకు సీఐ అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల శాంతిభద్రతల కోసమే పోలీసు శాఖ పని చేస్తోందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగాయన్నారు. నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నారని వివరించారు. పట్టణంలో అధికంగా మద్యం సేవించి వాహనాలు నడిపించడం వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. తాగి ప్రమాదాలకు గురైతే బీమా కూడా వర్తించదన్నారు. మైనర్‌లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడిపించాలన్నారు.



తాండూరు టౌన్ ఠాణా ఎదుట సీజ్ చేసిన బైక్‌లు

## పంట దిగుబడుల అంచనాలతో నష్ట నివారణ

**జిల్లా ఉపగణాంకాల అధికారి జలంధర్‌రెడ్డి**

**దోమ:** సాగు చేసిన పంటలు ఎంత మేర దిగుబడులు వస్తున్నాయో వ్యయసాయ అధికారులతో అంచనాలు వేయించుకోవాలని జిల్లా ఉపగణాంకాల అధికారి జలంధర్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని బొంపల్లి తండాలో ఫుటాన్‌భాయ్ రైతు పొలంలో కంది పంటను 10 మీటర్ల పొడవు, వెడల్పు కోతలు కోసి తూకం వేసి అంచనాలు వేశారు. ఇందులో రైతుకు క్వింటాల్‌కు 6.550 కిలోల దిగుబడి పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. పంట సాగులో రైతులు నష్ట పోకుండా అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక లాభాలు ఆర్జించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల గణాంకాల అధికారి సందీప్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ధరణిపై నజర్

- ఆపరేటర్ల అక్రమాలతో అప్రమత్తం
- పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు
- రికార్డులు చూసిన తర్వాతే ముందడుగు
- క్షేత్రస్థాయి నివేదిక తప్పనిసరి
- తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు
- రంగారెడ్డి జిల్లాలో 35 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పాత రికార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ధరణిలో నమోదైన అర్జీలను కొలిక్కి తేవడానికి ఆన్‌లైన్ నివేదిక సహా పహాణీ, పట్టాదార్ పాస్‌పుస్తకం తదితర ధ్రువీకరణలు పరిగణనలోకి తీసుకోవాలని సంకల్పించింది. వీటన్నింటితో క్షేత్రస్థాయి నివేదికను తప్పనిసరి చేస్తూ కలెక్టర్ భారతి హోళికేరి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తహసీల్దార్‌కు నివేదించి.. అక్కడి నుంచి నివేదిక కోరేవారు. ఈ నివేదిక ఆధారంగా అర్జీని ఆమోదించాలా? తిరస్కరించాలా అనే దానిపై కలెక్టర్ నిర్ణయం తీసుకునేవారు. ఈ నివేదికలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్న కొందరు అక్రమార్కులు తహసీల్దారులతో చేతులు కలపడంతో భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత లోపించింది. తప్పుడు నివేదికలతో భూ యాజమాన్య హక్కులు అసలైన పట్టాదారుకుగాకుండా.. వేరొకరికి దాఖలు పరచాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా నిషేధిత జాబితాలో ఉన్న సర్కారీ భూముల వ్యవహారంలో ఈ అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు తేలింది. 22ఏ నుంచి తీసేసేలా స్థానిక తహసీల్దార్లతో నివేదిక తెప్పించుకొని విలువైన భూములను కొల్లగొడుతున్నట్లు స్పష్టమైంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ధరణి అర్జీల పరిష్కారంలో అవకతవకలు జరిగినట్లు కలెక్టర్ గుర్తించారు. తమ ప్రమేయంలేకుండానే కిందిస్థాయి అధికారులు లాగిన్ ఐడీలతో అర్జీలకు ఆమోదముద్ర వేయడం సంచలనం సృష్టించింది. సాంకేతిక లోపాలను అసరాగా మలుచుకొని ఈ తతంగానికి పాల్పడినట్లు తేలడంతో అప్రమత్తమైన కలెక్టర్.. నివేదికలను కూలంకషంగా పరిశీలించిన తర్వాతే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ధరణిలో జరుగుతున్న లోటుపాట్లపై ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ప్రస్తావించారు. సరైన ధ్రువీకరణలు/ఆధారాల్లేకుండా భూ యజమాన్య హక్కులు బదలాయించడాన్ని తప్పుబట్టారు. ఈ క్రమంలోనే రెవెన్యూయంత్రాంగం ధరణిలో ఉన్నలోపాలను సవరించడమేగాకుండా.. కిందిస్థాయి నుంచి వచ్చే నివేదికలను కూడా సూక్ష్మంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు సమాచారం.

**ఇకపై పక్కాగా..**

భూములకు సంబంధించిన రికార్డులన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఉన్నాయి. పహాణీలు మొదలు..పట్టాదారు పాసు పుస్తకాల నకలు, భూమిశిస్తు చెల్లించిన రసీదులు ఇలా ప్రతి రికార్డు అక్కడ ఉంటుంది. ఏదైనా భూమికి సంబంధించి వివాదం తలెత్తినప్పుడు ఈ రికార్డులనే ప్రామాణికంగా తీసుకుని, వాటిని పరిష్కరిస్తుంటారు. ఇందులో పొందుపర్చిన వివరాలను ఆధారం చేసుకునే తహసీల్దార్లు రిపోర్టులు తయారు చేస్తుంటారు. క్షేత్రస్థాయి అధికారులు ఇచ్చే ఈ రిపోర్టులే ధరణి దరఖాస్తుల పరిష్కారంలో కీలకం. పాతరికార్డుల్లో ఉన్న వివరాలకు భిన్నంగా కొన్ని రిపోర్టులు ఉంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. భూమి పూర్వాపరాలు పరిశీలించకుండా కలెక్టర్లు కూడా వారిచ్చే రిపోర్టులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఒక్కోసారి కలెక్టర్లు కూడా వీటిని గుడ్డిగా ఆమోదించి.. ఆ తర్వాత న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆన్‌లైన్ రిపోర్టులతో పాటు ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించడం ద్వారా వీటికి చెక్‌పెట్టొచ్చని కలెక్టర్ భావిస్తున్నారు. ఆ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా ధరణి పోర్టల్‌లో 35 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. కలెక్టర్ ఆశించిన విధంగా రిపోర్టులు తయారు చేసి పంపడం కూడా క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందికి తలకు మించిన భారంగా మారనుంది.

**కేసును నీరుగార్చే ప్రయత్నం?**

ఇదిలా ఉంటే ధరణి దరఖాస్తుల క్లియరెన్స్‌లో భాగంగా కలెక్టర్ ఇటీవల పలు దరఖాస్తులను పరిష్కరించాల్సి వచ్చింది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు 53 కోర్టు కేసులు, రెండు పెండింగ్ మ్యూటేషన్లు, రెండు ల్యాండ్ మ్యాటర్స్, 16 అర్బన్ లాండ్ పట్టాదారు పాసుబుక్, 23 నిషేధిత జాబితావి, మూడు పాస్‌బుక్ డేటా కరెక్షన్ అప్లికేషన్లను క్లియర్ చేయించుకున్నారు. తహసీల్దార్లు పంపిన ఫిజికల్ రిపోర్టులు డి సెక్షన్ నుంచి ఇంకా కలెక్టర్ వద్దకు చేరకుండానే ఆ వివాదాస్పద మాడ్యుల్స్‌కు సంబంధించిన మరికొన్ని దరఖాస్తులు క్లియర్ అవ్వడాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ ఆ తర్వాత అంతర్గత విచారణ చేపట్టారు. ధరణి కోఆర్డినేటర్ నరేష్, ఆపరేటర్ రమేష్ అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు ఇదే అంశంపై ఆదిబట్ల పోలీసుస్టేషన్‌లోనూ లిఖిత పూర్వక ఫిర్యాదు చేయించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించిన సమగ్ర వివరాలను అందజేయాలని కోరుతూ సీసీఎల్ఏకు లేఖ రాశారు. ఈనెల 5న ఈ అంశాన్ని గుర్తించి, కేసు నమోదు చేసి 15 రోజులు దాటినా వివాదాస్పద దరఖాస్తుల క్లియరెన్స్ వెనుక దాగి ఉన్న అదృశ్య శక్తులను గుర్తించకపోవడాన్ని పరిశీలిస్తే అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదుపులోకి తీసుకున్న అనుమానితులను సైతం ఆ తర్వాత వదిలివేయడాన్ని పరిశీలిస్తే.. ఉద్దేశపూర్వకంగానే కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# తాండూరు @ రూ.65.52లక్షలు

**శాసనసభ ఎన్నికలకు అభ్యర్థులు రూ.40లక్షల వరకు ఖర్చు చేసేందుకు ఈసీ వెసులుబాటు కల్పించింది. ఇందుకు తగట్టుగా బహిరంగ సభలు, సమావేశాలకు, కార్యకర్తల భోజన ఖర్చులకు ధరల జాబితా సైతం ఇచ్చింది. అందుకు అనుగుణంగా అభ్యర్థులు ఎలక్షన్ కమిషన్‌కు తమ ఖర్చు వివరాలు అందజేశారు.**

- అభ్యర్థుల ఖర్చు వివరాలు వెల్లడించిన ఈసీ
- లెక్క తప్పని పోటీదారులు
- నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చూపిన అభ్యర్థులు



**తాండూరు:** ఎన్నికలు అంటే కోట్లు ఖర్చు చేస్తారు.. కానీ తాండూరు సెగ్మెంట్ అభ్యర్థులు మాత్రం రూ.లక్షల్లోనే ఖర్చు చేశారు.. ఎన్నికల అధికారులు అభ్యర్థుల ఖర్చును తేల్చారు. ఈ సెగ్మెంట్ నుంచి 21 మంది అభ్యర్థులు పోటీ చేస్తే కేవలం రూ.65.52లక్షలు ఖర్చు చేశారు. అందులో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాత్రమే 24.89లక్షలు ఖర్చు చేసినట్లు ఎన్నికల అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అయితే అధికంగా ఖర్చు చేసిన అభ్యర్థి ఓటమి చెందగా రూ.14.02లక్షలు ఖర్చు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి గెలుపొందడం విశేషం.

**ఖర్చు తక్కువే..**

నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి నవంబర్ 28 వరకు ఎన్నికల అధికారులు అభ్యర్థుల ఖర్చుల వివరాలను సేకరించారు. నామినేషన్ మొదలు అభ్యర్థుల ఖర్చుపై అధికారులు నిఘా ఉంచారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నిబంధనల ప్రకారం ఒక్కో అభ్యర్థి రూ.40లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. అంతకు మించితే ఎన్నికల నిబంధనల ప్రకారం వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. తాండూరు సెగ్మెంట్ నుంచి పోటీ చేసిన అభ్యర్థులు మాత్రం అంతకు తక్కువగానే ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. ప్రధాన పార్టీలు అభ్యర్థులు మినహాయిస్తే మిగిలిన వారంతా కలిసి రూ.5.23 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు.

**పద్దు వివరాలు**

| అభ్యర్థులు | ఖర్చు వివరాలు |
|---|---|
| రోహిత్‌రెడ్డి (బీఆర్ఎస్) | రూ.24.92 లక్షలు |
| మనోహర్‌రెడ్డి (కాంగ్రెస్) | రూ.14.02 లక్షలు |
| చంద్రశేఖర్ (బీఎస్పీ) | రూ.12.64 లక్షలు |
| శంకర్‌గౌడ్ (జనసేన) | రూ.8.72 లక్షలు |

**ఖర్చు రూ.కోట్లల్లో.. లెక్కలు రూ.లక్షల్లో..**

ప్రస్తుత రాజకీయాలలో ఎన్నికలు అంటేనే రూ.కోట్లతో కూడుకున్న వ్యవహారం.. ఎన్నికలు వస్తే చాలు ఓటర్లు సైతం డబ్బులు ఆశించడం సర్వసాధారణంగా మారింది. పేద, గొప్ప తేడా లేకుండా ఓటుకు నోటు తీసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. తాండూరు సెగ్మెంట్ నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో నలుగురు ఆర్థికంగా బలంగా ఉన్న నేతలవ్వడంతో ఖర్చుకు వెనుకాడ లేదు. ఈ ఎన్నికల సీజన్‌లో అనాధికార లెక్కల ప్రకారం తాండూరులో రూ.150 కోట్ల వరకు అభ్యర్థులు విడిల్చుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అభ్యర్థులు ఎన్నికల అధికారులకు ఇచ్చిన లెక్కలు మాత్రం రూ.లక్షల్లో ఉండటం గమనార్హం.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడిన వృద్ధుడు

బంట్వారం: టీవీఎస్ వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ హైస్కూల్ సమీపం వద్ద జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఎన్కెపల్లి గ్రామానికి చెందిన డి.లక్ష్మయ్య (60), బ్యాంక్ పని నిమిత్తం మధ్యాహ్న సమయంలో టీవీఎస్ వాహనంపై కోట్‌పల్లి మండల కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాండూరు వైపు వెళ్తున్న లోడింగ్ లారీ వెనుక నుంచి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. అదృష్టవశాత్తు లక్ష్మయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే బాధితుడికి వైద్యం చేయించారు. ఈ విషయమై ఎస్ఐ స్రవంతిని సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

### రేపు వెసెక్టమీ క్యాంపు

ఇబ్రహీంపట్నం: కుటుంబ నియంత్రణలో పురుషులను భాగస్వామ్యం చేయడం కోసం వెసెక్టమీ క్యాంపును 18న ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు సంబంధిత వైద్యాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కోత, కుట్టు లేకుండా పది నిమిషాల లోపు చేసే చిన్న ఆపరేషన్ వెసెక్టమీ అని వెల్లడించారు. ఆపరేషన్ అయిన వెంటనే ఇంటికి వెళ్లి పనులు చేసుకోవచ్చునని, నపుంసకత్వం రాదని తెలిపారు. వెసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న పురుషులకు రూ.1100లు, ప్రోత్సహించిన వారికి రూ. 200లు పారితోషికం ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు సమీపం ఆశ కార్యకర్తను, ఎఎన్ఎంలను, వైద్యాధికారిని సంప్రదించవచ్చునని తెలిపారు.

### మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



అభినందనలు తెలుపుతున్న యూనియన్ నేతలు, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నేతలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చంద్రశేఖర్‌తోపాటు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# కొడంగల్ బస్టాండ్‌కు మహర్దశ పట్టేనా?

- విస్తరణకు నోచుకోని వైనం
- ఇష్టారాజ్యంగా బస్సుల నిలుపుదల
- కనీస సదుపాయాలు కరువు
- పెరిగిన ప్రయాణికుల సంఖ్య




నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం (ఫైల్)

కొడంగల్ : కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల తాకిడికి సరిపోవడం లేదు. నిత్యం వేల మంది ప్రయాణం చేస్తుంటారు. గత పాలకులు బస్టాండ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తెలంగాణ – కర్నాటక రాష్ట్ర సరిహద్దులో బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సరైన సదుపాయాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు జాప్యం చేస్తున్నారు. జిల్లాల విభజనకు ముందు కొడంగల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండేది. అయితే కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ మాత్రం తాండూరు డిపో మేనేజర్ పరిధిలో ఉండేది. జిల్లాల విభజనలో కొడంగల్‌తో పాటు ఆర్టీసీ బస్టాండ్ కూడా వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చింది. వికారాబాద్ జిల్లాలో విలీనం జరిగిన తర్వాత వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రయాణికులు కూర్చోడానికి నాలుగైదు బెంచీలు మాత్రమే ఉన్నాయి. తాగునీటి వసతి లేదు. రక్షణ లేదు. రాత్రి వేళల్లో బస్టాండ్ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు, ఆర్టీసీ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



కొడంగల్ బస్టాండ్

**విస్తరణకు నోచుకోలేదు**

ఒకేసారి ఐదారు బస్సులు వస్తే ట్రాఫిక్ జాం అవుతోంది. బస్సులు నిలిచే ప్లాట్ ఫారాల పెంపుతో పాటు బస్టాండ్ స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. వికారాబాద్ జిల్లాలో కలిసిన తర్వాత బస్టాండ్ విస్తరణ గురించి అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**40 ఏళ్ల క్రితం నిర్మించారు**

కొడంగల్ బస్టాండ్‌ను 40 ఏళ్ల క్రితం నిర్మించారు. 24.10.1979లో అప్పటి రవాణాశాఖ మంత్రి వెంగల్‌రావు శంకుస్థాపన చేశారు. ప్లాట్‌ఫారాలు నిర్మాణం జరిగిన తర్వాత 19.12.1981న అప్పటి ముఖ్యమంత్రి టి.అంజయ్య, రవాణా శాఖ మంత్రి రోశయ్య చేతుల మీదుగా బస్టాండ్‌ను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు బస్టాండ్ అలానే ఉంది. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో కొడంగల్ బస్టాండ్‌కు మహర్దశ పడుతుందని ప్రయాణికులు ఆశిస్తున్నారు.



చెట్ల కింద కూర్చొన్న ప్రయాణికులు

### ఎమ్మెల్యేను కలిసిన 'తపాల' సంఘం నేతలు

తాండూరు: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని శనివారం తపాల ఉద్యోగుల సంఘం నేతలు కలిశారు. తాండూరు నియోజకవర్గంలోని పర్వత్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులతో పాటు తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణాముదిరాజ్, ట్రెజరర్ దివాకర్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తపాల ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. మరోవైపు పర్వత్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఇరుకుగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు మాణిక్‌రావు, అంబప్పలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే త్వరలో పాఠశాల నూతన భవన నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

# గ్రామ కంఠం భూమి కబ్జా

చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

దోమ : గ్రామ కంఠం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐనాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది వ్యాపారులు గ్రామ కంఠం భూమిని కబ్జా చేసి అనుమతులు లేకుండా ప్లాట్లను చేసి విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ భూమిపై ఎంపీడీఓకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా వ్యాపారులు గ్రామ కంఠం భూమిని కబ్జా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ కంఠం భూమికి సమీపంలో పాఠశాల ప్రహరీకి ఆనుకొని వ్యాపారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ముగ్గులు వేశారని చెప్పారు. పాఠశాలకు రాకపోకలకు లేకుండా అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని వాపోయారు. ప్లాట్లకు సంబంధించిన ధ్రువ పత్రాలు ఉంటే అనుమతులు పొంది ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కబ్జాభూమి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

# కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ

**రైతులను మోసం చేస్తున్న డీసీఎంఎస్ సిబ్బంది**

- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ జరుగుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన డీసీఎంఎస్ సిబ్బంది తూకంలో మోసాలకు పాల్పడుతూ రైతులను దగా చేస్తున్నారు. తాండూరు మండలం గోనూర్ , చెంగోల్, బెల్కటూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద డీసీఎంఎస్ సిబ్బంది తూకంలో మోసం చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ఒక బస్తాధాన్యం 41 కిలోలు మాత్రమే తూకం వేయాలి. కానీ డీసీఎంఎస్ సిబ్బంది ఒక బస్తా ధాన్యానికి 42 కిలోల 130 గ్రాములు తూకం వేస్తున్నారు. బస్తాకి కిలో నుంచి రెండు కిలోలు అదనంగా తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఇదేమిటని రైతులు అడిగితే ధాన్యంలో తాలు ఉండటం వల్ల అదనంగా తూకం వేస్తున్నామని చెబుతున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆటగా సాగుతుంది.



42 కిలోలు అదనంగా తూకం

**చర్యలు తీసుకుంటాం**

కొనుగోలు కేంద్రం వద్ద ఒక బస్తాధాన్యం 41 కిలోలు మాత్రమే తూకం వేయాలి. అదనంగా తూకం వేయొద్దు. అలా చేస్తే చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తాం.

– శ్యాంసుందర్‌రెడ్డి,డీసీఎంఎస్ మేనేజర్, తాండూరు

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్పమందిరంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే దేవాలయంలో గురుస్వామి సతీషన్ నాయర్, గిరీషన్ నాయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మణికంఠునికి అష్టాభిషేకం, శివలింగానికి అన్నాభిషేకం, గణపతిపూజ, హోమాలను నిర్వహించారు. అర్ధరాత్రి వందనం కార్యక్రమం చేశారు. పూజకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని తెలిపారు. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనస్సు ఏకాగ్రతతో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కన్యస్వాములతో పరిగిరోడ్డులోని పోచమ్మ దేవాలయం నుంచి శివమారుతీ గీతాఅయ్యప్పమందిరం వరకు మహాదీపారాధనతో ఊరేగింపు నిర్వహించారు. విద్యుత్ దీపాలు, రకరకాల పూలతో రథాన్ని సర్వాంగసుందరంగా అలంకరించి రథంపై అయ్యప్పస్వామి చిత్రపటంతో ఊరేగింపు చేశారు. కేరళ మేళతాళాల వాయిద్యం, ఆట పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

# ఆలయ భూమి కబ్జా

పూడూరు: ఆలయ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎంపీటీసీ సురేందర్, సర్పంచ్ వనజ మాట్లాడుతూ.. గ్రామ సమీపంలో 151 సర్వే నంబర్‌లో వీరహనుమాన్ విగ్రహం, బీరప్ప, గాలిపోచమ్మ దేవతామూర్తుల పురాతన విగ్రహాలు ఉన్నాయి. ప్రతి మూడేళ్లకోసారి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆ భూమిని హైదరాబాద్‌కు చెందిన ఆలంఖాన్ కొన్నారని అతని అనుచరుడు హైదర్ కబ్జా చేయడంతో పాటు దేవతామూర్తుల విగ్రహాలను తొలగించాడని తెలిపారు. దౌర్జన్యంగా గ్రామస్తులపై దాడులు చేస్తున్న సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో శనివారం చన్గోముల్ ఎస్ఐ గిరి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ గిరి

# యూజీడీ పనుల ప్రారంభం



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో యూజీడీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు మధుకాలనీలో మంచినీటి సరఫరా, యూజీడీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఏఏ వార్డుల్లో యూజీడీ సదుపాయం లేదో అక్కడ తప్పకుండా యూజీడీ పనులు చేపడతామన్నారు. పార్కుల అభివృద్ధిపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, స్థానిక కౌన్సిలర్ ఫైమిదా బేగం, నాయకులు దీపు, హసీబ్, యాదగిరి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కేంద్రం విఫలం

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సింగపాగ జంగయ్య**

షాద్‌నగర్: ఇచ్చిన హామీ అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సింగపాగ జంగయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింగపాగ జంగయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నా ఏ ప్రభుత్వాలు, పార్టీలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తమను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి నేటి వరకు మాదిగలు అభివృద్ధికి నోచుకోలేదని ఆయన చెప్పారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మాదిగలు, మాదిగ ఉపకులాల పురోభివృద్ధి సాధించాల్సి అవశ్యకత ఉందన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని సింగపాగ జంగయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం బిల్లు ప్రవేశపెట్టకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 20న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, కృష్ణ, శ్యాం, భీంరాజ్, రాజు, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

### ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

**సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్**

షాబాద్: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తామని పెద్దవేడు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకొని సొంత ఖర్చులతో మట్టి రోడ్డు వేయించారు. శనివారం పెద్దవేడు గ్రామంలో వేసిన రోడ్డును గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు పరుస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ కాలని నుంచి రైతుల తమతమ పొలాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు మార్గంగుండా వెళ్లొచన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రామకృష్ణగౌడ్, ఆంజనేయులుగౌడ్, కృష్ణ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యురాలిగా శిరీష



చేవెళ్ల: ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యురాలిగా చేవెళ్ల మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన శిరీష ఎన్నికైంది. శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో జరుగుతున్న ఏబీవీపీ జాతీయ మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు రాష్ట్ర కార్యవర్గంలో సభ్యురాలిగా చోటు కల్పించడం సంతోషకరమన్నారు. ఏబీవీపీ అంటేనే విద్యారంగ సమస్యలపై పోరాటం చేసే అతి పెద్ద సంస్థ అని చెప్పారు. తన ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులకు శిరిష కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి పోరాడుతానని ఆమె పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్



స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరిన కౌన్సిలర్ స్వాతి రాజ్‌కుమార్ దంపతులు

కాంగ్రెస్ కండువా కప్పుకొన్న స్వాతి

వికారాబాద్ అర్బన్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో కౌన్సిలర్ కాంగ్రెస్ గూటికి చేరారు. మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు కౌన్సిలర్ మోముల స్వాతి రాజ్‌కుమార్ దంపతులు శనివారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ సమక్షంలో , మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది రోజుల వ్యవధిలోనే ఇద్దరు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయంశమైంది. మరింత కొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ఘనంగా స్వామివారి కల్యాణం

చేవెళ్ల: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శనివారం చేవెళ్ల మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన పెంజర్ల వెంకట్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణం నిర్వహించి గరుడవాహన సేవలో పాల్గొన్నారు. ఆలయం చుట్టూ గరుడవాహన సేవను ఊరేగించారు. గోవిందా.. గోవిందా..అంటూ నామస్మరణం ఆలయం మార్మోగింది.

**మాలధారుల పూజలు..**

మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది మాలధరించిన స్వాములు భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో స్వామి వారి పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు, స్వాములకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారి శైలజ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల ధర్నా

మంచాల: మంచాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆటో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో నడుపుకొని జీవించే ఆటో కార్మికులకు పూట గడవని దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఆటో నడుపుకొని కుటుంబ పోషణ సాగించే నిరుపేదల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. బ్యాంకుల్లో అప్పులు చేసి ఆటోలు కొనుకొని, ఈఎంఐలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు వేణుగోపాల్ రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.